క్లుప్తంగా

16న వాహనాలకు వేలం

తెనాలి రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఐదు మోటారు సైకిళ్లకు ఈ నెల 16న వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి. చలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు అధికారులు నిర్ణయించిన మొత్తంలో 10 శాతం డీడీ రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు 9440902474 నంబరులో సంప్రదించాలని కోరారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత



తెనాలి రూరల్: ఇటీవల మృతి చెందిన వాసవీ క్లబ్ సభ్యుల కుటుంబ సభ్యులకు సోమవారం జిల్లా గవర్నర్ గోనుగుంట్ల జయంత్ కుమార్, గడవర్తి మల్లికార్జునరావు, పులిపాటి సుధాకర మూర్తి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన గ్రంధి ప్రతాప్ మృతి చెందగా ఆయన భార్య దుర్గా యామినికి రూ. 3,11,100, వలివేటి అప్పారావు నామినీ పద్మనాభుని జ్యోతిర్మయికి రూ. 1,06,400 చెక్కులను అందజేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని న్యూ-వేమవరం చానల్‌పై ఉన్న రక్షిత తాగునీటి సరఫరా పథకం మోటార్ మరమ్మతులకు గురి కావడంతో సిబ్బంది సోమవారం పనులు చేపట్టారు. దీంతో భట్టిప్రోలు దళితవాడ, అద్దేపల్లి, భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ ప్రాంతాల సరఫరాకు అంతరాయం కలిగినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా చేస్తామని సర్పంచి దారా రవి కిరణ్మయి తెలిపారు.

ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలి

వేమూరు: ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెలలో ఇంటి పన్ను వసూలు ముమ్మరం చేయాలని చెప్పారు. వసూళ్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

వాటర్ షెడ్ల అభివృద్ధిపై శిక్షణ

బాపట్ల: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు వాటర్ షెడ్ల అభివృద్ధిపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విస్తరణ శిక్షణ కేంద్రం, భూ వనరుల శాఖ సౌజన్యంతో ఈ శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహిస్తునట్లు ఆయన చెప్పారు. వాటర్ షెడ్‌లో సాంకేతికతపై శిక్షణలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా సరోజని నాయుడు జయంతి



సరోజని నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళాభ్యుదవాది సరోజనీ నాయుడు జయంతి వేడుకలను దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు సరోజనీనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, పౌర హక్కులు, మహిళా విముక్తి కోసం కృషిచేసిన గొప్ప దార్శనికురాలు సరోజనీ నాయుడు అని అన్నారు. ఆమె చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తిని పెంచుకుని 12వ ఏటనే కవిత్వం, రచనలు చేయడం మొదలు పెట్టారని తెలిపారు. 1906లో మహిళలకు విద్య అవసరమని భావించి దేశవ్యాప్తంగా అనేక సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకువచ్చారని వివరించారు. సరోజనీనాయుడు గౌరవార్థం ఆమె జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి, అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వరరావు, కుర్ర నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ఘనత సీఎం జగన్‌దే..

ఎమ్మెల్యే శివకుమార్



కొలకలూరులో సచివాలయం-2ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: దేశంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు దళితవాడలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం-2ను సోమవారం ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలు తీర్చడానికి, కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సచివాలయాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండడానికి ఒక్కో సచివాలయాన్ని రూ.40లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, వైస్ ఎంపీపీ స్వప్న, ఎంపీటీసీ సభ్యులు చక్కా సీతమ్మ, నాగదేవిక, ఎంపీడీవో విజయ లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, తులాబంధుల లక్ష్మీ కోటేశ్వరరావు, రావూరి రవిబాబు, వీరమల్లు కార్తికేయ, సూరవరపు వీరారెడ్డి పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు సాంబశివరావుకు సన్మానం



సాంబశివరావును సన్మానిస్తున్న సినీ నటి రాజశ్రీ, మాటల రచయిత సాయిమాధవ్ తదితరులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం అగ్గి బరాటా చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం సత్యహరిశ్చంద్ర చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ బుర్రకథ కళాకారుడు బొల్లిముంత సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి రాజశ్రీ , మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దివి అనిత, ఉత్సవ కమిటీ సభ్యులు టి.ఎస్.ఎస్. శ్రీనివాస్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తాడిబోయిన హరిప్రసాద్, మాదల కోటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవర పల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, గుమ్మడి ప్రసాద్, దేవిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

దాడిని నిరసిస్తూ మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన



నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తెనాలి అర్బన్: ఉద్యోగిపై దాడిని నిరసిస్తూ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రషీద్‌పై కొందరు బయట వ్యక్తులు కార్యాలయంలోనే దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు. దీన్ని ఉద్యోగులందరూ ఖండిస్తున్నట్లు చెప్పారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆకురాతి రామచంద్రరావు, మేనేజర్ అప్పలస్వామి, ఆర్‌ఐలు మోహన్‌కృష్ణ, కుర్రా శ్రీను, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఏఎస్ఎన్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన లిఫ్టర్లతో డాక్టర్ రామ్‌చంద్, శేషగిరిరావు

తెనాలి: గుంటూరులోని గవర్నమెంట్ కాలేజీ ఫర్ విమెన్ ఆధ్వర్యంలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ టీం చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి చెందిన లిఫ్టర్లు ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాలను సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చెప్పారు. కాలేజీ విద్యార్థిని ముక్కడాల అనూష (52 కిలోల విభాగం) షేక్ రషీద్ (83 కిలోలు), పాలేరు భార్గవ్ రామ్ తమ విభాగాల్లో బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని నాగార్జున యూనివర్సిటీ పీజీ క్యాంపస్‌లో చదువుతూ తమ కాలేజీలో శిక్షణ పొందుతున్న ముక్కామల సంయుక్త 84 ప్లస్ కేటగిరీలో బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. హిమాచలప్రదేశ్‌లో మార్చిలో జరగనున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ (మహిళలు) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ముక్కడాల అనూష , ముక్కామల సంయుక్త ఎంపికైనట్టు వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు వెల్లడించారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

బాపట్ల: బీసీల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం బాపట్ల నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవులు మహేష్ ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం కేసన మాట్లాడుతూ బీసీలు అభ్యున్నతికి పారిశ్రామిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, యువత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రుణాలను బీసీ వర్గాల ప్రజలకు పెద్దఎత్తున కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఇటీవల లేఖ ద్వారా పలు అంశాలపై విన్నపాలను తెలిపానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారక, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎస్పీ రాజు, నేతలు తురక గోపి, ఏడుకొండలు, వీరమల్లు చంద్రమౌళి, నారాయణ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన మాస్టర్ అథ్లెట్స్



జాతీయ పోటీలకు ఎంపికైన మాస్టర్స్ అథ్లెట్స్‌ను అభినందిస్తున్న ముప్పలనేని

బాపట్ల: స్థానిక మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు సోమవారం జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానించారు. ఈసందర్భంగా ముప్పలనేని మాట్లాడుతూ హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలకు క్రీడాకారులకు ఎంపిక కావడం హర్షణీయమని చెప్పారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో కె.శంకరరావు, కె.సాంబశివరావు, షేక్ నజీర్, ఎం.సురేంద్ర, షేక్ ఇమామ్, ఎన్.మురళీకృష్ణారెడ్డి, డి.సుబ్బారావు, రామస్వామి, రవికుమార్, కె.శ్రీనివాసరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులుతో పాటు దొప్పలపూడి రామమోహనరావు పాల్గొన్నారు.

16 నుంచి రాజరాజ నరేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు పాంచాహ్నిక దీక్షతో వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంపని అంజయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని 16వ తేదీన పెండ్లి కుమారుడ్ని చేయడం, 17న స్వామి వారిని నెమలి వాహనంపై గ్రామోత్సవం, 18న స్వామి కల్యాణోత్సవం, 19న రథోత్సవం, 20న వసంతోత్సవం, 21న ధ్వజ అవరోహణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్వామి కల్యాణ మహోత్సవాలు మహా శివరాత్రి పర్వ దినాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

స్థలాన్ని ఆక్రమించారంటూ నిరాహార దీక్ష

బాపట్ల అర్బన్: కొందరు అక్రమార్కులు తమ స్థలాన్ని ఆక్రమించి కంచె వేయడాన్ని నిరసిస్తూ రెండురోజుల నుంచి బాధితులు నిరాహార దీక్ష చేపట్టారు. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య సోమవారం నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం అప్పటి మాజీ స్పీకర్, ఎమ్మెల్యే కోన ప్రభాకరరావు ఇందిరానగర్ ప్రజలకు ఒక్కొక్కరికీ ఐదు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. చెరువు కోసం 15 సెంట్ల స్థలాన్ని ఇచ్చారని, అనంతర కాలంలో చెరువు గుంతను అంగన్‌వాడీ పిల్లల పాఠశాల కోసమని ప్రజలు అధికారులను సంప్రదించి పూడ్చడం జరిగిందన్నారు. నేడు ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారని పేర్కొన్నారు. సమస్యను ఎమ్మెల్యే కోన రఘుపతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దీక్షలో కుప్పాల నరసింహ, తాడిశెట్టి సాంబయ్య, దుప్పల రాఘవ, తాడిశెట్టి శివకుమారి, మల్లెల రాధిక, రేగులగడ్డ మరియమ్మ, మాజీ వార్డు కౌన్సిలర్ పసుమర్తి యలమంద, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్లి చిన్నా, కాగిత రవి పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

గుంటూరు ఈస్ట్: ఇద్దరు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌కు చెందిన బాలసైదులు భార్య వెంకటపద్మ ఈనెల 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సైదులు సోమవారం పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కొరిటెపాడుకు చెందిన వీధుల శ్రీనివాస్ గతనెల 19న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంటచింతలకు చెందిన దేగల సైదారాజు గుంటూరు కన్నావారితోటకు చెందిన ఆలపాటి శ్రావణ్‌కుమార్‌కు రూ. 2.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. హామీ కింద చెక్కులు, నోట్లు ఇచ్చాడు. అయితే, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. డిసెంబరు 10న సైదారాజు కన్నావారితోటలోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. శ్రావణ్‌కుమార్ తాను డబ్బులు ఇవ్వనని చెబుతూ, సైదారాజును కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ ఆర్చి సమీపంలో కొందరు సింగిల్ నంబరు ఆట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేశారు. కడియం విజయకుమార్, నరసింహారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 2,900 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సాయి

తెనాలి టౌన్: రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సాయి 100 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ పీఆర్వో సతీష్, పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, కఠెవరపు శివయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న వైస్ ఛైర్మన్ హరిప్రసాద్

తెనాలి టౌన్: విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ తెలిపారు. నాజరుపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్వీయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగ సభ్యులు కన్నెగంటి పిచ్చయ్య మాస్టారు, సుశీలాదేవి దంపతులు మనుమరాలు సరయు పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో గత ఏడాది 10వ తరగతిలో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థికి రూ.మూడు వేలు, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.రెండు వేలు, తృతీయ స్థానం విద్యార్థికి రూ.రెండు వేలను అందజేశారు. బహుమతుల్ని వైస్ చైర్మన్ హరిప్రసాద్, పిచ్చయ్య మాస్టారు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, కఠారి హరీష్, కన్నెగంటి నరేంద్రకుమార్, కీర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే విద్యపై ఆసక్తి అవసరం

మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్‌ను సన్మానిస్తున్న గీతాకాంత్, ఉపాధ్యాయులు

తెనాలి అర్బన్: బాల్యం నుంచే విద్యపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూలులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రిఫ్లక్షన్ (ప్రతిబింబం) కార్యక్రమంలో సోమవారంతో ముగిసింది. నీతిని బోధించే పలు లఘు నాటికల్ని విద్యార్థులు ప్రదర్శించారు. జాతీయ నాయకులు చిత్రాలను ప్రదర్శిస్తూ వారి జీవిత చరిత్రల్ని తెలియజేశారు. అనంతరం చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ బాధితుడికి సాయం



చంద్రయ్యకు దుస్తుల పంపిణీ

తెనాలి: సంచార జాతులకు చెందిన గిరిజనులకు ఆహారం, దుస్తులు పంపిణీ చేస్తున్న పట్టణానికి చెందిన ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా ట్రస్ట్ అనారోగ్య పీడితులకూ సాయం అందిస్తోంది. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న తాటాకుల చంద్రయ్య (35)ను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఎక్స్‌రే, రక్తపరీక్షలు చేసిన వైద్యులు క్షయవ్యాధి ఉన్నట్టుగా నిర్ధారించారు. అక్కడే చికిత్సకు ఏర్పాట్లు చేశారు. డిశ్చార్జ్ చేసిన అనంతరం ఆరు నెలలు మందులు వాడాల్సి ఉన్నందున, ఆ కాలానికి సరిపడా నిత్యావసర వస్తువులు, దుస్తులను తమ సంస్థ తరపున పంపిణీ చేస్తామని వ్యవస్థాపకురాలు రావూరి అంజలి, డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం వెల్లడించారు. సంచార జాతుల కులాలకు చెందిన పలువురు అనారోగ్యానికి గురవుతున్నా వైద్యం చేయించుకునే ఆర్థికస్తోమత వారికి లేదని తెలిపారు. ఆసుపత్రిలో చేరినా పరీక్షలకు అవసరమైన ఆధార్ కార్డు లేనందున ఇబ్బందులకు గురవుతున్నారని తమ సర్వేలో తేలిందన్నారు. కొన్ని పరీక్షలను ప్రైవేటు క్లినిక్స్‌లో చేయిస్తున్నట్టు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి చేతనైనంత సాయం చేస్తామని వివరించారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి

హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్



లే-అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్

భట్టిప్రోలు: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్ పేర్కొన్నారు. స్థానిక జగనన్న కాలనీల్లోని లే-అవుట్లలో గృహ నిర్మాణాల లబ్ధిదారుల సమావేశం సోమవారం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు గూడు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు మండల సమాఖ్య తరపున రూ.35 వేలు ఆర్థిక సహాయం అందచేస్తుందని వివరించారు. వెంటనే బేస్‌మెంట్ పూర్తి చేస్తే, తర్వాత గృహ నిర్మాణానికి అవసరమైన ఐరన్, సిమెంట్, ఇసుక పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లే-అవుట్లలో ఈపాటికే విద్యుత్ సౌకర్యం కల్పించబడిందని, త్వరలో పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాగర్, శిరీష, సీసీ హనూక్, హౌసింగ్ సిబ్బంది బాలకృష్ణ ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో అవకతవకలు ఉంటే సీజ్ చేస్తాం

సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి విలియమ్స్



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి విలియమ్స్

బాపట్ల టౌన్: పెట్రోల్ బంక్‌లో అవకతవకలకు పాల్పడితే బంక్‌లు సీజ్ చేస్తామని సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి విలియమ్స్ హెచ్చరించారు. సోమవారం జిల్లాలోని పలు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, పెట్రోల్ బంక్‌ల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి, తహసీల్దార్, సీఎస్‌డీటీ, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లను కమిటీలుగా ఏర్పాటు చేశారు. డీఎస్‌ఓ విలియమ్స్ మాట్లాడుతూ జిల్లాలో 105 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ బంక్‌ల్లో జరిగే అవకతవకలను నివారించేందుకు నూతనంగా ఏపీ పెట్రోల్ బంక్ ఇన్‌స్పెక్షన్ యాప్‌ను రూపొందించిందని తెలిపారు. బంక్‌ల్లో జరిగే అక్రమాలకు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. పెట్రోల్ బంక్‌ల్లో ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, గాలి మిషన్లు, సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారయణ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళాభ్యుదయం వంటివి సమాజం ముందంజకు దోహదపడతాయన్నారు. మహిళలను గౌరవించి, మన సంప్రదాయాల్ని పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకరాలు డాక్టర్ కనకరత్నం, తులసీజ్యోతి, ఆషా పాల్గొన్నారు.